క్లుప్తంగా

అణగారిన వర్గాల కోసం పనిచేయాలి

టేకుమట్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అణగారిన వర్గాల కోసం ఎన్‌హెచ్‌ఆర్‌సీ పని చేయాలని మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనగారిన, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం ఎన్‌హెచ్‌ఆర్‌సీ పని చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికై న మండల కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, ఈసీ కమిటీ సభ్యులు కోటగిరి సతీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



టేకుమట్ల: జాతీయ మానవ హక్కుల కమిషన్ మండల అధ్యక్షుడిగా మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన శాస్త్రాల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా రామకిష్టాపూర్(వి) నాంపెల్లి వీరేశంను రాష్ట్ర ఈసీ సభ్యుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రాల కిరణ్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల తనిఖీ



రేగొండ: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం తహసీల్దార్ శ్వేత ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట రూమ్‌తో పాటు, స్టోర్ రూంను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రభాకర్‌తో కలిసి భోజనం చేశారు. వారి వెంట ఆర్‌ఐ నరేశ్, ప్రిన్సిపాల్ మనోరమ ఉన్నారు.

యాసంగి పంటల సాగుపై అవగాహన

రేగొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యాసంగి సీజన్‌లో పంటల సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ.. యాసంగిలో పంటలు సాగుచేసే పద్ధతి, విత్తనశుద్ధి, చీడపీడల నివారణ, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి, మండల విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భూపాలపల్లి అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన పట్టణంలోని గణేష్‌చౌక్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎండీ మంజూర్ అనే వ్యక్తి అంబేడ్కర్ కూడలి నుంచి ద్విచక్ర వాహనంపై బాంబుల గడ్డ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గణేష్‌చౌక్ వద్ద గోదావరిఖని వెళ్లే బస్సు ఆగి ఉండగా.. ఆ బస్సు పక్క నుంచి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో వెనకాలే వచ్చినా లారీ బస్సులో ఓవర్‌టేక్ చేస్తుండగా బస్సుకు, లారీకి మధ్యలో మంజూర్ ఇరుక్కుపోయి కిందపడిపోగా కాలికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.

యాచకుడి మృతి..



గణపురం: మండలంలోని కర్కపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని తుపాకి రాముడు అలియాస్ సమ్మయ్య అనే యాచకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. భూపాలపల్లి బాంబుల గడ్డకు చెందిన సమ్మయ్య యాచనకు వెళ్లి వస్తుండగా కర్కపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



డ్రైయినేజీ లేకపోవడంతో రోడ్డు మధ్యలో నిలిచిన మురుగు

- రోడ్లపై పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు

పలిమెల: సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఏడాది కావొస్తుంది.. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అస్తవ్యస్తంగా నెలకొంది. వర్షాకాలం ముగియడంతో అధికారులు గ్రామాలపై కన్నెత్తి కూడా చూడటం లేదని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పంకెన గ్రామంలో డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లపై, ఇళ్ల పక్కనే పారుతోంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు, దోమలు, ఈగలతో రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి



గ్రామంలో సైడ్ కాల్వలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలుస్తోంది. ఆ రోడ్డు వెంట వెళ్లాలన్న కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సైడ్ కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

-బాలు, పంకెన, గ్రామస్తుడు

రైతులకు బేడీలు వేయడం సిగ్గుచేటు



మొగుళ్లపల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జనార్దన్

భూపాలపల్లి రూరల్: భూములను కాపాడుకోవడానికి అడ్డుపడిన రైతులను అదుపులోకి తీసుకోని క్రిమినల్స్‌లాగా చేతులకు బేడీలు వేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అన్నారు. లగచర్ల రైతన్నలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశానుసారం బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల నెపంతో బలవంతంగా భూములను లాక్కోవాలని చూసిన వారిపై రైతులు తిరగబడితే వారిని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అన్నం పెట్టె రైతన్న గుండెపోటుకు గురైతే ఆస్పత్రికి ఒక దేశద్రోహిలా, ఉగ్రవాదుల లాగా బేడీలు వేసి తీసుకురావడం రేవంత్ రెడ్డి దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, నాయకులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: లగచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహనికి వినతిపత్రం అందజేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు మాట్లాడుతూ.. భూములు ఇవ్వమని అంటే రైతులపై అప్రజాస్వామికంగా కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ పెట్టి టార్చర్‌కు గురిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, నాయకులు బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, దానబోయిన రాములు, చెక్క శ్రీధర్, ముడుపు రవీందర్, దేవునూరి కుమార్, అన్నారెడ్డి, జగ్గారావు, మహమ్మద్ రహీం, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం


- బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కాటారం: రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వంద శాతం రైతులకు రుణమాఫీ చేశామని అసత్య ప్రచారాలు చేయించుకుంటుందని అన్నారు. నాల్గొవ విడత ద్వారా రూ.3వేల కోట్లు రుణమాఫీ చేశామని రైతుల పేర్లతో సహా లిస్టులు విడుదల చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని ఆరోపించారు. రైతులు రుణమాఫీ అయిందనుకొని సమయం వృథా చేసుకుంటూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు చెప్పుకుంటూ కాలం వెల్లదీస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే నాల్గవ విడత రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నరివెద్ది శ్రీనివాస్, జక్కు శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి ఉద్యోగుల నిరసన



బతుకమ్మ ఆడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ములుగు: న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎనిమిది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు బతుకమ్మ ఆడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగస్తులకు తక్షణమే పే స్కేల్ అమలు చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రత్యేక జీఓ ఇవ్వాలని, లేకుంటే నిరవధిక సమ్మె కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సమ్మె చేస్తున్న సమయంలో స్వయంగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మద్దతు తెలిపి అధికారంలోకి రాగానే డిమాండ్లను నెరవేరుస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడియా, ఉపాధ్యక్షులు ఎండీ ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేశ్ సమన్వయకర్తలు స్వాతి, అనిత, ప్రవీణ్, విష్ణు, తిరుమల, స్వప్నలత, ప్రవీణ్, చిరంజీవి, విజయ్, దేవేందర్, సుబ్బారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని

మంగపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. స్నాక్స్ పంపిణీ, భోజన ఏర్పాట్లు, కిచెన్ హాల్, పరిసరాల పరిశుభ్రత, కిరాణా సరుకులు, కూరగాయలు, వంట నిర్వాహకులు పాటిస్తున్న పరిశుభ్రత తీరును పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారంగా ఆహారాన్ని అందించాలని పాఠశాల స్పెషలాఫీసర్ భాగ్య, వంట సిబ్బందికి సూచించారు.

రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన

మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సందర్శించారు. పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ రిజిస్టర్‌లను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఒకరి అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

టేకుమట్ల: రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన గృహిణి బైకాని స్రవంతి ఆత్మహత్యకు కారణమైన టేకుమట్లకు చెందిన మచ్చ రాకేశ్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చిట్యాల సర్కిల్ సీఐ మల్లేశ్‌యాదవ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉడుత కుమారస్వామి కూతురు స్రవంతిని గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌తో వివాహం జరిపించారు. కాగా రాకేశ్ పాత పరిచయంతో నిత్యం స్రవంతిని వేధించడమే కాకుండా ఇటీవల గోరికొత్తపల్లికి వెళ్లి తనతో రావాలని ఒత్తిడి చేయడంతో ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. దీంతో స్రవంతిని భర్త తల్లిగారింటికి తీసుకువచ్చి వదిలేశాడు. రాకేశ్ వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురై ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. కాగా స్రవంతి ఆత్మహత్యకు కారణమైన రాకేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై గోగికారి ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ వెంకటేశ్వర్ రావు, కానిస్టేబుల్ వెంకటేష్‌లు ఉన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్




విజేతలకు బహుమతులు అందజేస్తున్న పోలీసులు

కాటారం: సువిద్య హైస్కూల్ చైర్మన్ కొట్టె శ్రీశైలం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ సోమవారం రాత్రి ముగిసింది. సుమారు 60 మంది క్రీడాకారులు ఈ షటిల్ టోర్నమెంట్‌లో పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ హోరాహోరిగా సాగింది. ప్రథమ స్థానంలో ఉదయ్, ప్రవీణ్, ద్వితీయ స్థానంలో కడారి శేఖర్, లింగమూర్తి, తృతీయ స్థానంలో జోడు శ్రీనివాస్, నవీన్ విజేతలుగా నిలవగా సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూతల సమ్మయ్య, గడ్డం కొమురయ్య, అంగజాల అశోక్, జనగామ కరుణాకర్ రావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల అరెస్ట్‌లు సరికాదు

రేగొండ: రాష్ట్ర ప్రభుత్వం సెకండ్ ఏఎన్‌ఎమ్‌లను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని మండల ఎఎన్‌ఎమ్‌ల అధ్యక్షురాలు బొట్ల దీన అన్నారు. తమను పర్మినెంట్ చేయాలని నిరసన తెలుపడానికి మంగళవారం హైదరాబాద్‌కు వెళ్తున్న ఏఎన్‌ఎంలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. 17 సంవత్సరాలుగా చాలిచాలనీ జీతాలతో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఎటువంటి పరీక్షలు లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6500 మంది ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు కళావతి, మంజుల, అనసూర్య , రాధిక, జ్యోత్స్న దేవి, భాగ్య, యాదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మల్లీశ్వరి

మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేట, అంకుషాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం భూపాలపల్లి సీడీపీఓ మల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రిజిస్టర్లు, ఫుడ్‌స్టాక్, ప్రీస్కూల్ యాక్టివిటీస్, పోషణ వంటి వాటిని పరిశీలించారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. పౌష్టికాహారం, పరిశుభ్రతపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సూచనలు చేశారు. ఆమె వెంట సెక్టార్ సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ఇళ్ల సర్వే సకాలంలో పూర్తిచేయాలి

- డీఎల్‌పీఓ వీరభద్రయ్య



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రయ్య

కాటారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామ పంచాయతీల్లో సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌పీఓ వీరభద్రయ్య ఆదేశించారు. మండలంలోని జాదారావుపేట గ్రామ పంచాయతీని మంగళవారం డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులపై ఆరా తీశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని సూచించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

గంజాయి జోలికి వెళ్తే చర్యలు

- ఎస్సై మ్యాక అభినవ్



మాట్లాడుతున్న ఎస్సై మ్యాక అభినవ్

కాటారం: గంజాయి జోలికి వెళ్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై మ్యాక అభినవ్ హెచ్చరించారు. గంజాయి నియంత్రణలో భాగంగా కొంత కాలంగా గంజాయి కేసుల్లో సంబంధం ఉన్న వారితో పాటు యువతకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కౌన్సిలింగ్ నిర్వహించారు. గంజాయి సేవించడం వల్ల కలిగే అనార్ధాల గూర్చి వారికి వివరించారు. గంజాయి సేవించిన, అమ్మిన, సరఫరా చేసిన సహించేది లేదన్నారు. గంజాయిపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుకు బానిసలై తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్‌కి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలిపాలని కోరారు.

నిధులు విడుదల చేయాలని వినతి



శ్రీపాద విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్హర్: ఫ్రీజింగ్‌లో ఉన్న రెండో విడుత దళితబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని మండలంలోని కొయ్యూరు సెంటర్‌లోని దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహానికి మంగళవారం దళిత బంధుసాధన సమితి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబ దళిత బంధు అంశంపై ఆలోచించాలన్నారు. అలాగే బీసీ బంధు నిధులు పెంచుతూ.. కొనసాగించాలని, అర్హులైన దివ్యాంగులకు ఉపాధి కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు సంపత్ మహారాజ్, జిల్లా కమిటీ ముఖ్య నాయకులు శ్రావణ్, మల్హర్ మండల కన్వీనర్ రమేశ్, వెంకటేష్, ముత్తయ్య, లచ్చన్న, సురేష్ పెద్ద సమ్మయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తెలపాలి

- శ్రీనివాస్ గోమాసే



మాట్లాడుతున్న శ్రీనివాస్ గోమాసే

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఎంటో తెలపాలని నేతకాని మహార్ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గోమాసే ప్రశ్నించారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంఖ్య జనాభా ప్రతిపాదికన సామాజిక న్యాయం జరగడానికి వర్గీకరణ చేసుకోవచ్చని, ఆ పూర్తి అధికారాలు రాష్ట్రాలకు ఉన్నాయని అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కమిటీలు జిల్లాల వారిగా నడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై తమ వైఖరేంటో చెప్పకపోవడం సరైంది కాదన్నారు. నేతకాని కులస్తులం తమ హక్కుల సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏకతాటిపైకి వచ్చి జేఏసీ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో నేతకాని కుల సంఘం నాయకులు చల్లూరి సమ్మయ్య, గోగుల మధన్ మోహన్, ఆకుదారి సత్యనారాయణ, గుమాస భూమయ్య, బొౌతు రాజేష్, దుర్గం అశోక్, దుర్గం బిక్షపతి, సర్వేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శగ్రామం గంగదేవిపల్లి సందర్శన



భూపాలపల్లి, ములుగు జిల్లాల సభ్యులు

గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఎస్‌జీఓ) ట్రైనీలు శ్రీనివాస్, నర్సింహులు ఆధ్వర్యంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ఏడు గ్రామాలకు చెందిన సభ్యులు మంగళవారం సందర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో 120 గ్రామాల్లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి విద్య, ప్రజారోగ్యం, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గుర్రంపేట, మోరంచపల్లి, నందిగామ, లక్ష్మీదేవిపేట, బూర్గుపేట, వెంకటేశ్వరపల్లి, నగరంపల్లికి చెందిన ట్రస్టులోని కమిటీల బాధ్యులు గంగదేవిపల్లిని సందర్శించారు. గ్రామాభివృద్ధి తీరు, జాతీయ స్థాయిలో గుర్తింపు, పలు అవార్డులు సొంతం చేసుకున్న విషయాలను జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి ఆయా కమిటీల బాధ్యులకు వివరించారు. ఆర్‌డీటీ ఏరియా టీం లీడర్ సంజీవ్‌కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రతాప్, లక్ష్మణ్‌మూర్తి, గంగదేవిపల్లి కమిటీల సభ్యులు మేడిద సుశీల, గూడ సరోజన పాల్గొన్నారు.

చిందు కళాకారులకు ఇళ్లు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న ప్రశాంత్

రేగొండ: గృహలక్ష్మి పథకం ద్వారా చిందు కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ చిందు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం ప్రశాంత్ అన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 సంవత్సరాల నుంచి చిందు కళాకారులు ఏ ప్రభుత్వ పథకమూ పొందలేదన్నారు. ఈ కార్యక్రమంలో చిందు రాజ్యాధికార సమాఖ్య ఉపాధ్యక్షుడు గడ్డం పశుపతి, కళాకారులు సమ్మయ్య, శంకర్, శివాజీతో పాటు తదితరులు పాల్గొన్నారు.